
ప్రజాశక్తి
గురువారం 6 ఫిబ్రవరి 2025 5 విజయనగరం



## లింగ నిర్ధారణ చేస్తే
## స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

**డిఎంహెచ్ఒ జీవనరాణి**

ప్రజాశక్తి-విజయనగరంకోట

లింగ నిర్ధారణ చేస్తే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్ఒ జీవనరాణి హెచ్చరించారు. బుధవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించాల్సిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన చట్టాన్ని తప్పక అమలు చేస్తామని చెప్పారు. స్కానింగ్ సెంటర్లను విధిగా పర్యవేక్షించాలని ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిసిపిఎన్‌డిటి నోడల్ అడికారి అచ్చుత కుమారి, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎన్. సూర్యనారాయణ, డాక్టర్ రజిని కుమారి, డాక్టర్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లు రద్దు చేయాలని
# సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు






విజయనగరంలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు ; ఎల్.కోటలో లేబర్‌కోడ్ల ప్రతులను దహనం చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లేబర్ కోడ్లపై కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు కార్మికులకు నష్టం కలిగించే లేబర్‌కోడ్లను రద్దు చేయాలని బుధవారం సిఐటియు ఆధ్వర్యాన జిల్లాలో పలుచోట్ల నిరసనలు చేపట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో విజయనగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. కోవిడ్ కాలంలో పార్లమెంట్‌లో, బయట ఎలాంటి చర్చా లేకుండా నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏనాడైనా అమలు ఉత్తర్వులు ఇస్తామని ఇటీవల ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రీ బడ్జెట్ సమావేశంలో కార్మిక నాయకుల సమక్షంలో ప్రకటించారని, వీటిని కార్మిక నాయకులంతా వ్యతిరేకించారని తెలిపారు. కార్మిక హక్కులు కాలరాసి పెట్టుబడిదారులకు పెద్దపీట వేయడానికి లేబర్‌కోడ్లు తీసుకొచ్చారని మండిపడ్డారు. దీనివల్ల దోపిడీని మరింత తీవ్రతరం చేయనున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. లేబర్‌కోడ్లను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్ మోహన్‌రావు, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, ఎస్‌బ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, మెడికల్ సేల్స్, రిప్రజెంటేటివ్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భగవాన్, సుధీర్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి భాస్కరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మహాలక్ష్మి, నాయకులు నాగమ్మ, అప్పయ్యమ్మ, ఆర్‌టిసి యూనియన్ నాయకులు సురేష్, జిసిసి సోప్ యూనిట్ నాయకులు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

**రాజాం :** రాజాంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.త్రినాథ్, యూనియన్ నాయకులు కంచి నాయుడు, శ్రీనివాసరావు, భుజంగరావు, నారాయణరావు, సూర్యనారాయణ, శ్రీను, వెంకటరమణ, రాము, గోవింద, గవరయ్య, నరసింహులు, ఆదినారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**కొత్తవలస :** కొత్తవలస అంబేద్కర్ కూడలి వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడు అప్పారావు, రైతు సంఘం జిల్లా నాయకులు జి.కృష్ణమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో బెహరా సూర్యనారాయణ, మునూరు శివ, తదితరులు పాల్గొన్నారు.

**లక్కవరపుకోట :** లక్కవరపుకోట ప్రధాన రహదారిలో అంబేద్కర్ కూడలి వద్ద రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా ప్రధానకార్యదర్శి గాడు అప్పారావు, సిఐటియు మండల అధ్యక్షులు తరిణి వెంకటరమణ, నాయకులు గొల్ల దేవి, పలమరశెట్టి దేవి, ఎస్.సరస్వతి, గొల్ల సోములు, తాళ్లపల్లి దేవుడమ్మ, మద్దిల దేవుడు, కామాకు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

**మెంటాడ :** మెంటాడలో గాంధీ విగ్రహం వద్ద లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శి జి.సన్యాసమ్మ, పి.వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త బి.కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలిరూరల్ :** బొబ్బిలి మండలంలోని ఎం.బూర్జవలసలో లేబర్ కోడ్లను రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.గోపాల్, నాయకులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**పూసపాటిరేగ :** పూసపాటిరేగలో లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి.సూర్యనారాయణ మాట్లాడారు. ర్యాలీలో సిహెచ్ సత్యవతి, బి.సత్యవతి, ఎ.సంతోష్, పండు తదితరులు పాల్గొన్నారు

**దత్తిరాజేరు :** సిఐటియు ఆధ్వర్యంలో దత్తిరాజేరు మండలం కోమటిపల్లి ఆటో జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లెంక దాలినాయుడు, బి.అప్పలనాయుడు, నాయకులు పి.సూర్యనారాయణ, రాము, ఈశ్వరరావు, పైడిరాజు, మురళి, ఐ.అప్పారావు పాల్గొన్నారు.

**గరివిడి :** గరివిడిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట సిఐటియు మండల కార్యదర్శి అంబల్ల గౌరీనాయుడు ఆధ్వర్యాన లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో మైన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు పిసిని అప్పలనాయుడు, కర్ణ సన్యాసినాయుడు, సేనాపతి పాపినాయుడు, సేనాపతి రమణ, ఫేకర్ యూనియన్ నాయకులు ఉత్తరావల్లి ప్రకాశ్, ముఖేష్ సింగ్ పాల్గొన్నారు.

# మరో 5 రైతు బజార్లు

**వ్యవసాయ ఉత్పత్తులకు మరిన్ని గోదాముల ప్రతిపాదన**




ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో మరో ఐదు రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు సాగుతోంది. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యాన ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ చేసుకునేందుకు మరిన్ని దోదాములను కూడా ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు ఆశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఏడు రైతు బజార్లు మాత్రమే ఉన్నాయి. చీపురుపల్లిలో మరొకటి నిర్మాణ దశలో ఉంది.

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నా, వినియోగదారులకు తాజాగా కూరగాయలు అందుబాటులో ఉంచాలన్నా అదనంగా రైతుబజార్లు ఏర్పాటు చేయాల్సిందే. వీటి డిమాండ్ పట్టణ ప్రాంతాల్లో మరింత ఎక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో భోగాపురం, కొత్తవలస, గరివిడి, గజపతినగరం, నెల్లిమర్ల పట్టణాల్లో రైతుబజార్ల సంఖ్యను పెంచేందుకు కసరత్తు చేశామని అధికారులు చెబుతున్నారు. ఈలోపు చీపురుపల్లిలో చేపట్టిన రైతుబజార్ నిర్మాణం పూర్తికానుంది. వచ్చే ఐదేళ్లలో జిల్లాలోని రైతు బజార్ల సంఖ్య 13కి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్తగా ప్రతిపాదించిన రైతు బజారు ఒక్కింటికీ రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు అవసరం కానున్నట్టు బడ్జెట్ అంచనాలను కూడా రూపొందించారు. ఇందులో ప్రధానంగా అధునాతన కార్యాలయం, స్టాళ్లు, ప్లాట్ ఫారాలతోపాటు విద్యుత్, లైటింగ్ సిస్టమ్, తాగునీటి కోసం ఆర్‌ఒ ప్లాంట్, మరుగుదొడ్లు, డిజిటల్ ధరల పట్టిక తదితర సదుపాయాలు కల్పించనున్నారు.

రైతు బజార్ల సంఖ్యను పెంచడం ద్వారా సరసమైన ధరలకు తాజాగా కూరగాయలు పట్టణ ప్రాంతాల్లో అందుబాటులోకి రానున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు 38 గోదాముల నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటి వరకు 24 గోదాముల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వచ్చే ఐదేళ్లలో మరో 168 గోదాములను చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేశారు. అయితే, ఈ రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు టిడిపి హయాంలో చాలా సార్లు ప్రతిపాదనలు ముందుకు వచ్చినప్పటికీ, ఆచరణకు నోచుకోలేదు. కానీ, రైతు బజార్ల వ్యవస్థను ప్రవేశపెట్టింది ఒకప్పుడు టిడిపి ప్రభుత్వమే. కాబట్టి ఈసారి తప్పక బడ్జెట్ కేటాయిస్తుందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

## సమాజ చైతన్యానికి కళాకారులు కృషి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కళాకారులు సమాజాన్ని చైతన్య పరుస్తారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది కళాకారులేనన్నారు. ప్రజా కళాకారులు డాక్టర్ గరికపాటి రాజారావు, పద్మశ్రీ షేక్ నాజర్ జయంతి సందర్భంగా బుధవారం నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయంలో కళాకారుల సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంలో కళాకారులు పాత్ర ఎంతో కీలకమన్నారు.

జానపద కళాకారుల జిల్లా అధ్యక్షులు పి.షణ్ముఖరావు మాట్లాడుతూ ఆట, పాట, మాటల ద్వారా కళాకారులు సమాజాన్ని ఉత్తేజ పరుస్తారని తెలిపారు. అనంతరం 15 మంది సభ్యులతో కూడిన జిల్లా నవ్యాంధ్ర ప్రజా మండలి కమిటీని ప్రకటించారు. ఈ కమిటీ జిల్లా అధ్యక్షులుగా గంద్రేటి శ్రీను (డప్పు శ్రీను), కార్యదర్శిగా మన్నెపురి అప్పలనాయుడును ఎంపిక చేశారు.

## వసతిగృహ సిబ్బందిపై చర్యలు

**బాలల హక్కుల కమిషన్ చైర్మన్ ఆదేశం ● విద్యార్థులకు పరామర్శ**



విద్యార్థిని పరామర్శిస్తున్న చైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

బాలికల వసతిగృహంలో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటనపై విచారణ చేపట్టి, అక్కడి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశించారు. విజయనగరంలోని సుంకరివీధిలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో కలుషిత ఆహారం తీసుకొని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆయన బుధవారం పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, మిషన్ వాత్సల్య సిబ్బందితో కలిసి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రెండు వారాలుగా విద్యార్థులు ఆహారం విషయాల్లో ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి తీసుకురావడంతో వసతిగృహ అధికారులు, సిబ్బందిని హెచ్చరించినట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడినట్లు చెప్పారు. ఇటువంటి సంఘటనలు, ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించినట్లు గుర్తుచేశారు. అదే రోజు సాయంత్రం సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని తెలిపారు.

అనంతరం తెర్లాం మండలంలో తొమ్మిదో తరగతి విద్యార్థి పురుగులు మందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆయన పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామానుజం, జిల్లా బాలల సంరక్షణ అధికారి భీంపల్లి లక్ష్మి, మిషన్ వాత్సల్య, సిబ్బంది యాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### కోలుకుంటున్న విద్యార్థులు
**డిఎస్‌డబ్ల్యుఒ రామానందం**

**విజయనగరం టౌన్ :** ప్రభుత్వ ఆస్పత్రిలో కడుపునొప్పి కారణంగా చేరిన వసతిగృహ విద్యార్థినుల్లో నలుగురికి మెరుగైన వైద్యం అందుతుందని, వారు కోలుకుంటున్నారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి.రామానందం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రిలో చేరిన రోజు ఇద్దరు డిశ్చార్జి అయ్యారని, నలుగురు విద్యార్థులకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. 20 మంది విద్యార్థులు ఆస్పత్రిలో చేరినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని వివరణ ఇచ్చారు. ఆరుగురు మాత్రమే ఆస్పత్రిలో చేరారని వెల్లడించారు.




సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఐ రవిశంకర్

## ఏకాగ్రతతోనే ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

డ్రైవర్లు ఏకాగ్రతతో, ఎలాంటి ఒత్తిడి లేకుండా డ్రైవింగ్ చేస్తే 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్తు మినిస్ట్రీరియల్ భవనంపై ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో ఎపిపిటిడి హెయిర్ బస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడారు. ప్రయాణికుల, ప్రజల, ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉంటుందన్నారు. అనేక సందర్భాల్లో డ్రైవర్లు అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల తృటిలో ప్రమాదాల నుంచి తప్పిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు.

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి సత్యనారాయణ, ఎస్‌బ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, నివారణకు చర్యలు తీసుకోవలసిన ప్రభుత్వాలు డ్రైవర్లను ముద్దాయిలను చేస్తూ చట్టాల్లో మార్పులు తీసుకురావడం బాధాకరమన్నారు. రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, డ్రైవర్లపై తీవ్ర ఒత్తిడి, రహదారుల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మోటారు ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు కనీస వేతనాలు, సంక్షేమ చట్టాలు అమలు చేయాలని, రవాణా రంగాన్ని సేవా రంగంగా గుర్తించాలని తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు జెఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డిపో అధ్యక్ష, కార్యదర్శులు మధు, వాసు, జిల్లా కోశాధికారి కోటి, డ్రైవర్లు పాల్గొన్నారు.








**ఓవైపు శాస్త్రీయ, జానపద నృత్యాలు, సినిమా పాటలు.... మరోవైపు ఆలోచింపజేసే రచనలు, క్విజ్ పోటీలు, లఘు నాటికలు, ఇంకోవైపు ఏకపాత్రాభినయాలు, మట్టితో బొమ్మల తయారీలో సృజనాత్మకత.. ఇలా ఒకటా, రెండా!! చివరికి చిత్రలేఖనం, సెల్ఫ్‌బి, పద్యాల పరంపర, ఫ్యాన్సీ డ్రెస్సింగ్ పోటీల్లో సైతం బాలబాలికలు ఉప్పొంగే ఉత్సాహంతో పాల్గొన్నారు. చిన్నారుల ప్రతిభకు సభికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. విజయనగరం బాలోత్సవ కమిటీ ఆధ్వర్యాన నగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో మంగళ, బుధవారాల్లో బాలోత్సవాలు నిర్వహించిన విషయం విదితమే. ఉత్సవాలు విజయవంతమయ్యాయి. ఈ రెండు రోజుల్లో సుమారు 1400 మంది బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. విజయనగరం ఉత్సవాలకు, విజయనగరంలో కళాకారులకు, కళాభిమానులకు కొదవలేదన్న కఠోర సత్యాన్ని మరోసారి రుజువు చేశారు. అదే రీతిలో కళాపోషకుల నుంచీ సహకారం లభిస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు.**



థింసా నృత్యం చేస్తున్న బాలికలు

# భళారే బాలోత్సవం

- కట్టిపడేసిన చిన్నారుల సృజనాత్మకత
- ఆట పాటల్లోనూ మేటి
- సభికుల హర్షాతిరేకాలు
- విజయవంతంగా ముగిసిన విజయనగరం బాలోత్సవం

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఆనంద గజపతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న విజయనగరం బాలోత్సవం కార్యక్రమంలో రెండో రోజు బుధవారం వక్తృత్వ పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, సెల్ఫ్‌బి, శాస్త్రీయ నృత్యం, పద్య పఠనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. చిన్నారుల కేరింతలు, ముద్దులొలికే మాటలు, అబ్బురపరిచే వేషధారణలు, ఉర్రూతలూగించే జానపద నృత్యాలతో బాలోత్సవం మురిపించింది. రెండు రోజుల పాటు జరిగిన బాలోత్సవానికి జిల్లా నుంచి 25 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 1400 మంది విద్యార్థులు హాజరై వారి ప్రతిభ కనబరిచారు. విద్యార్థినీ విద్యార్థులు అందంగా అలంకరించుకుని ఆకట్టుకునే వేషధారణలో చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జానపద పాటలకు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు చేశారు. విద్యార్థులు కేరింతలతో ఆడిటోరియం మార్మోగిపోయింది. ఇలాంటి కార్యక్రమాలు తమలో ఇమిడి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు దోహదపడతాయని విద్యార్థులు చెబుతున్నారు.

**ఔరా అనిపించేలా..**

రెండు రోజుల పాటు సాగిన బాలోత్సవంలో బాలల నృత్యాలు అలరించాయి. నిన్నటి నుంచి కొనసాగింపుగా జానపదులు, శాస్త్రీయ మేళవింపుతో సంప్రదాయ నృత్యాలతో ఔరా అనిపించారు. సభికుల చప్పట్లతో ఆడిటోరియం హోరెత్తింది. బాలలు గీసిన చిత్రాలు, మట్టితో తయారు చేసిన బొమ్మలు.. వారి సృజనాత్మకతకు, ప్రతిభకు దర్పనం పట్టాయి. ముగింపు కార్యక్రమంలో విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు విజయనగరం బాలోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి జిఎస్ చలం, కె.శ్రీనివాసరావు ఆధ్వర్యాన బహుమతులు అందజేశారు. ఎంఆర్, సత్య కళాశాలల ఎన్‌సిసి క్యాడెట్లు, ఎస్ఎఫ్ఐ నాయకులు వలంటీర్లుగా సేవలందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజు, వై.శ్రీనివాసరావు, చిన్నాదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.







జానపద నృత్యం చేస్తున్న బాలికలు

జానపద గేయాలాపన చేస్తున్న డప్పు శ్రీను బృందం

క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులు

# 195 కంపెనీల ఏర్పాటుకు అనుమతులు

- పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి
- ప్రతినెలా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం
- కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

గత ఆరు నెలల కాలంలో సింగిల్ విండో విధానంలో 221 పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు అందగా, 195 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. సింగిల్ విండో విధానంలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా పరిశ్రమలకు త్వరగా అనుమతులు మంజూరు చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఇకపై ప్రతి నెలా 5వ తేదీన పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం నిర్వహించి త్వరగా అనుమతులు వచ్చేలా చూస్తామన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి వద్ద అధికంగా పెండింగ్ ఉన్నందున త్వరగా పరిష్కరించాలని ఇఇని ఆదేశించారు. పిఎం విశ్వకర్మ పథకం కింద 65,908 దరఖాస్తుల్లో 5852 యూనిట్ల ఏర్పాటుకు ఆమోదం తెలపడంపై కలెక్టర్ ఆరా తీశారు. వివిధ స్థాయిల్లో 41,514 దరఖాస్తులు ఎవరి వద్ద ఎందుకు పెండింగ్ ఉన్నదీ తనకు నివేదించాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. యూనిట్లు మంజూరైన వారికి ఎలాంటి శిక్షణ అందిస్తున్నదీ తెలుసుకున్నారు.

చిన్న పరిశ్రమలపై జరుగుతున్న సర్వేపై కలెక్టర్ సమీక్షించారు. ఎంఎస్ఎంఇ సర్వే వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఇందులో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు స్థలాల కేటాయింపు పొందిన సంస్థలు.. ఆ గడువు తీరిపోవడంతో కొంత అదనపు సమయం ఇవ్వాలని అభ్యర్థించాయి. దీంతో ఏడు పరిశ్రమలకు ఏడాది వరకు సమయం ఇస్తూ ప్రోత్సాహక మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆయా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ పరంగా ఏదైనా సహాయ సహకారాలు అవసరమైతే అందించి, ఆ యూనిట్లు ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఐదు పరిశ్రమలు తాము ఒప్పందంలో పేర్కొన్న ఉత్పత్తులకు బదులుగా వేరొక ఉత్పత్తుల తయారీకి దరఖాస్తు చేసుకోగా, ఆ ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ సమావేశంలో నిర్ణయించారు.

ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న పలువురు జిల్లా స్థాయి అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. సమావేశానికి హాజరుకాలేని అధికారులు ఇకపై ముందస్తు అనుమతి పొందాలని స్పష్టంచేశారు.

సమావేశంలో జిల్లా పరిశ్రమల ఇన్‌ఛార్జి అధికారి మదుసూధన్ రెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీమోహనరావు, కాలుష్య నియంత్రణమండలి ఇఇ సరిత, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణచక్రవర్తి, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, డిప్యూటీ కలెక్టర్ జోసెఫ్, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి, చేనేత జౌళి ఎడి మురళీకృష్ణ, మార్కెటింగ్ ఎడి బి.రవికిరణ్, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, భూగర్భ జలశాఖ డిడి దుర్గాప్రసాద్, బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీ, జిల్లా రిజిస్ట్రార్, మెప్మా పీడీ తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగలో పర్యటిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

## హైవేలో బ్లాక్ స్పాట్లను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - పూసపాటి రేగ

భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో జాతీయ రహదారిలో గల బ్లాక్ స్పాట్స్‌ను బుధవారం ఎస్‌పి వకుల్ జిందాల్ పరిశీలించారు. అనంతరం ఆయన పూసపాటిరేగ జాతీయ రహదారి ఆనుకొని ఉన్న 75 సెంట్ల పోలీసుల స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ మూడు మండలాలను ఆనుకుని 32 కిలోమీటర్లు జాతీయ రహదారి ఉందని ఇందులో 16 బ్లాక్ పాయింట్స్ ఉన్నాయన్నారు. ఆ పాయింట్లలో ప్రమాదాల నివారణ ఎలా అన్నదానిపై చర్చించి నిర్ణయిస్తామన్నారు. రహదారి వెంబడి లైటింగ్ పటిష్టం చేస్తామన్నారు. సర్వీసు రోడ్లకు వెళ్ళను రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. హైవే వెంబడి లైటింగ్స్ పెంచేలా అధికారులతో మాట్లాడుతామన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గతేడాదితో పోల్చితే ప్రస్తుతం ప్రమాదాల సంఖ్య తగ్గించలేకపోయినా పెరగకుండా చర్యలు చేపట్టున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిఐ రామకృష్ణ, ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, సన్యాసినాయుడు తదితరులు ఉన్నారు.

## 'కళా'ను పరామర్శించిన బేబినాయన

ప్రజాశక్తి- రేగిడి

చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావును బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన బుధవారం పరామర్శించారు. కళా సోదరుడు కిమిడి సత్యనారాయణ నాయుడు ఇటీవల అకాల మరణం చెందడంతో రేగిడి గ్రామంలో వారి నివాసం వద్ద కళా వెంకటరావును, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావుని, కిమిడి రామకృష్ణనాయుడును, కిమిడి సత్యనారాయణ కుమారులు సూరపు నాయుడులను బేబినాయన పరామర్శించారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు ఉన్నారు.

## తాగునీరు సంపూర్ణంగా అందించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందించాలని పిసిసి సభ్యులు ముప్పల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ వేగావతి నదిలో నీరు తగ్గడం వల్ల పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందడం లేదన్నారు. తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సీతానగరం సువర్ణముఖి నది నుంచి పైపులైన్ పనులు పూర్తి చేయాలన్నారు.

## మంచి ప్రమాణాల విద్య ఎక్కడ?

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వాలు విద్య కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా మంచి ప్రమాణల విద్యను పిల్లలకు అందించడంలో విఫలమవుతున్నాయని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్య కోసం 2023-24 సంవత్సరంలో 32,198 కోట్లు, 2024-25 సంవత్సరంలో రూ.29,909 కోట్లు కేటాయించాయని అయినా విద్యార్థుల విద్యా ప్రమాణాలు అనుకున్న స్థాయిలో మెరుగు పడడం లేదని అన్నారు. అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల విద్య అందించవలసిన ప్రభుత్వాలు నేడు విద్యను వ్యాపారంగా మార్చేయన్నారు. ఇదే ధోరణి కొన సాగితే మన భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు.

## రబీ పంటలకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి- బాడంగి

రబీలో వేసే పంటలకు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని ఎఒ శిరీష అన్నారు. బుధవారం మండలం లోని వాడాడ, రేజేరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడి ప్రస్తుతం సాగులో ఉన్న పంటల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రబీ సీజన్‌లో ఈ పంట నమోదు - ఇకెవైసి అనేది ప్రతి రైతు తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎఎ సాయికుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా టెస్టు పేపర్లు అందజేత

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఎంఇఒ త్రినాధరావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టెస్ట్ పేపర్లను యుటిఎఫ్ నాయకులు ఉచితంగా అందజేశారు. మండలంలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులందరూ ఈ పుస్తకాలు ఉపయోగించుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, యుటిఎఫ్ నాయకులు జి.మునుస్వామి, బి.ఉమామహేశ్వరరావు, జి.శంకరరావు, పి.రాంబాబు, నాగేశ్వరరావు, కె.రాము, యన్.రమేష్, వేణుగోపాల్, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలో గల అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు మరుగు దొడ్ల నిర్వహణపై బుధవారం ఎంఇఒ త్రినాధరావు అవగాహన కల్పించారు. వీరికి మరుగు దొడ్ల నిర్వహణలో ఏ విధమైన పద్ధతులు పాటించాలో వివరించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న టాయిలెట్ క్లీనింగ్ పనిముట్లు, టాయిలెట్ క్లీనింగ్ రసాయనాలు ఉపయోగించి మరుగుదొడ్ల నిర్వహణ పటిష్ఠంగా చేయాలని సూచించారు. పాఠశాలల పరిశుభ్రత, మరుగు దొడ్ల పరిశుభ్రతల నిర్వహణలో ఆయాలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరో ఎంఇఒ పాపారావు, అన్ని స్కూల్స్ ఆయాలు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ స్థలానికి తీర్మానించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానికంగా ఉన్న పాత బస్టాండ్‌లో నూతనంగా మంజూరైన అన్న క్యాంటీన్ స్థలం కోసం పంచాయతీ తీర్మానం చేయించాలని ఎంపిపి సండి సోమేశ్వరరావు, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ బోర్డ్ డైరెక్టర్, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని బస్టాండ్‌లో నూతనంగా మంజూరైన అన్న క్యాంటీన్ స్థలం కోసం జెడ్‌పి సిఇఒ, ఎమ్మెల్యే లలితకుమారి సందర్శించి స్థల విషయం పంచాయతీ సర్పంచ్, బోర్డు సభ్యులతో మాట్లాడి తీర్మానం చేయించాలని కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యనిర్వాహణాధికారి అనురాధ, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, వార్డ్ మెంబర్లు ఆడారి సూరిబాబు, భారతి తదితరులు పాల్గొన్నారు.

## 'కొల్ల'ను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సంతకవిటి

టిడిపి సీనియర్ నాయకులు, తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు తండ్రి సూర్యనారాయణ(94) మృతి చెందడంతో ఆయన పార్థివ దేహం వద్ద ఎమ్మెల్యే కోండ్రు మురళీ నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని మామిడిపల్లిలో బుధవారం ఎమ్మెల్యే కోండ్రు మురళిమోహన్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్యలు కలసి కొల్ల సూర్యనారాయణ పార్థవదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొల్ల అప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మెంటాడ పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ పిహెచ్‌సిలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి ఎస్.జీవనరాణి ఆకస్మింగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు గురించి సమీక్షించారు. పిహెచ్‌సిలో మందులు ఇచ్చే గదిని, వాక్సిన్స్ నిల్వ గది, లేబ్ రేటరీ గదులను తనిఖీ చేశారు. ఆస్పత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పిహెచ్‌సిలో మరింత మెరుగైన సేవలు అందించాలని, ఫీల్డ్ లెవెల్ చిన్న పిల్లలకు ఇచ్చే వ్యాక్సిన్ టార్గెట్ కనీసం 95 శాతం అధిగమించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు సంభవించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జె లోకప్రియ, జి కల్పన, డిఎంహెచ్ఒ సిసి చంద్రశేఖరరాజు, సిహెచ్ఒ ఎస్ సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ తాడ్డి మన్మధరావు, నర్సింహులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపాదనలతోనే సరి

- శిథిల పాఠశాలకు మంజూరు కాని నిధులు
- గిరిజనుల చదువుపై చిన్న చూపు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కేజీపూడి సచివాలయం పరిధిలో గల బంగారయ్య పేట, చిట్టివానిపాలెం గిరిజన గ్రామాల మధ్యలో ప్రాథమిక పాఠశాలను గతంలో ఏర్పాటు చేశారు. కొండను ఆనుకుని నిర్మించిన ఈ పాఠశాలలో 17 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. ఈ రెండు గ్రామాల నుంచి బడికి వెళ్లే పిల్లలు రహదారి లేక పొలం గట్లు పైన, డొంకలు మధ్య సుమారు అర కిలోమీటరు నడిచి వెళ్లాలి. వర్షాకాలంలో పిల్లలు పలుమార్లు గట్లు పై జారి బురదలో పుస్తకాలు పడి ఇబ్బందులు పడిన సందర్భాలున్నాయి. ఏదో విధంగా పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలని ఆశతో తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపిస్తున్నారు. అటువంటి ఈ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే స్లాబు ఎప్పుడు కూలిపోతుందోనని తెలియని పరిస్థితి. గోడలు కూడా బీటలు వారి ఉన్నాయి. స్లాబ్ పెచ్చులు కూడా ఊడిపోయి ఉన్నాయి. కిటికీలకు రెక్కలు లేవు, రికార్డులు భద్రపరుచుకోవడానికి కూడా అవకాశం లేదు. పిల్లలకు వంటగది కూడా సరిగా లేకపోవడంతో ఇంటి వద్ద వంట మనిషి వంట చేసి పిల్లలకు తేవాల్సి వస్తుంది, తాగడానికి నీటి సౌకర్యం కూడా లేదు. తాగునీటి బోరు పాడైపోవడంతో చిట్టివానిపాలెం నుంచి జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సౌకర్యం నిమిత్తం పాయింట్ ఏర్పాటు చేశారు కానీ నీరు రావడం లేదు. భోజనం పెట్టే సమయానికి పిల్లలకు చిట్టివానిపాలెం గ్రామం వెళ్లి బకెట్లతో తాగునీరు తెచ్చుకోవాలసిన పరిస్థితి ఏర్పడింది. టాయిలెట్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పలుమార్లు ప్రజాశక్తి దినపత్రికలో కథనం వెలువడటంతో భవన నిర్మాణంతో పాటు సౌకర్యాల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించారు తప్ప ఇంకా నిధులు మాత్రం మంజూరు కావడం లేదు. గిరిజనుల మీద చిన్నచూపు లేకుండా అధికారులు స్పందించి భవన నిర్మాణంతో పాటు సౌకర్యాలు కల్పనకు నిధులు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



తలుపులు లేని కిటికీలు

### ఎప్పుడు కూలిపోతుందో..

పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనతో విద్యను కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వ అశ్రద్ధ వల్ల నిధులు మంజూరు కాకపోయినప్పటికీ ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టి గిరిజన గ్రామాల పిల్లలకు చదువుకునే అవకాశం కల్పించాలని రెండు గ్రామాల పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలభవనంలో పాటాలు చెబుతున్న ఉపాధ్యాయిని

## సైకిల్ షెడ్ నిర్మాణానికి వితరణ

**బాడంగి:** మండలంలోని వాడాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సైకిల్ షెడ్ నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన కీర్తిశేషులు రిజనల్ డిప్యూటీ డైరెక్టర్ కందుల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన భార్య వాసవి, కుమార్తెలు కామేశ్వరి, సరోజ, లక్ష్మిసాయి రూ.1.50లక్షలు వితరణగా ఇచ్చారు. ఈ షెడ్ నిర్మాణం పూర్తవడంతో బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులందరికీ జిప్ ఫైల్స్ వ్యాకరణ పుస్తకాలు అందజేశారు. కొల్లి సత్యంను, దాతలను ప్రధానోపాధ్యాయులు సుందరరావు, స్థానిక నాయకులు పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి త్రినాథ, పిఎంసి చైర్మన్ మురళి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు ఉపాధ్యాయ సిబ్బంది కృష్ణమూర్తి, అజయ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## డ్రైవర్ల ఫ్యామిలీ కౌన్సిలింగ్ డే

**శృంగవరపుకోట:** రహదారి భద్రతా మాసోత్స వాలలో భాగంగా బుధవారం డిపో మేనేజర్ కె. రమేష్ ఆధ్వర్యంలో స్థానిక డిపోలో 'డ్రైవర్స్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ డే' నిర్వహించారు. డిపో పరిధిలో గల డ్రైవర్లకు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన రహదారి భద్రతలు, పాటించాల్సిన నియమాలు గురించి వివరించారు. హాజరైన మహిళలకు పండ్లు, జాకెట్ వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు, డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తులు తలెత్తకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - గుర్ల

విపత్తులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ తహశీల్దార్ వి.నారాయణమ్మ సూచించారు. మండలంలోని కలవచర్లలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్) డిప్యూటీ జనరల్ మేనేజర్ సాయి కిషోర్ టీమ్ ఆధ్వర్యంలో బుధవారం ఆఫ్‌సైట్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పారదీప్-హైదరాబాద్ పైప్ లైన్ మండలంలో 25 కిలోమీటర్లు పొడుగునా పోతుందన్నారు. ఈ పైప్ లైన్ ద్వారా పెట్రోల్, డీజిల్, ఏటిఎఫ్ ఆయిల్స్‌ను రవాణా చేస్తున్నారన్నారు. అంతకుముందు అరగంట పాటు ఐఒసిఎల్ అధికారులు వారి సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించి కళ్ళకద్దినట్టు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పైప్ లైన్ వెళ్లే మార్గంలో ఒకవేళ పైప్‌లైన్ లీకేజీ సంభవిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం అందజేస్తామని కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. పైప్‌లైన్ వెళ్లే మార్గంలో భూమిపైన పైప్ లైన్ లీకేజీకి తలెత్తే బావులు తవ్వడం, బోర్లు తవ్వించడం, పంటలు పూర్తయ్యాక మంటలు పెట్టడం, దృఢమైన వృక్షాలు నాట్టడం లాంటివి చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యడ్ల గోపీనాయుడు, టిడిపి, జనసేన పార్టీల నాయకులు నీలిరోతు అప్పారావు, బెవర కూర్మారావు, చీపురుపల్లి ఫైర్ ఆఫీసర్ హేమసుందర్, పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీధర్, ఐఒసిఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సాయి కిషోర్, ఆపరేషనల్ ఎండ్ మైంటైనెన్స్ మేనేజర్, మెయిన్ లైన్ ఆఫీసర్ లక్ష్మి నారాయణరెడ్డి, పి. గణేష్ బాబులతో పాటు ఐఒసిఎల్ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిటి నారాయణమ్మ

# చేపల చెరువులు తవ్వితే ఊరుకోం

**మత్స్యశాఖ అసిస్టెంట్ తనిఖీ అధికారికి రైతులు విన్నపం**

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వెంకంపేట-మీసాల డోలపేట పరిధిలో ఉన్న వ్యవసాయ భూములలో చేపల చెరువులు ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని మత్స్య శాఖ అసిస్టెంట్ తనిఖీ అధికారి ప్రసాద్ రావుకు బుధవారం రైతులు విన్నవించారు. మంగళవారం వెంకంపేట గ్రామ రైతులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందించిన విషయాన్ని ప్రజాశక్తిలో చేపల చెరువులకు అనుమతులు ఇవ్వద్దు అనే కథనానికి మత్స్య శాఖ జిల్లా అధికారులు స్పందించారు. తక్షణమే గ్రామాన్ని సందర్శించి నివేదికలు అందించాలని రాజాం క్లస్టర్ మత్స్య శాఖ సహాయ తనిఖీ అధికారి ప్రసాద్ రావుకు ఆదేశించారు. దీంతో ప్రసాదరావు గ్రామానికి చేరుకొని సచివాలయంలో రైతులను పిలిచి సమస్యను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో రైతులతో వెళ్లి పరిశీలించారు. ఈ ప్రాంతంలో 20 ఎకరాలకు సంబంధించి చేపల చెరువులు ఏర్పాటుకు మాజీ సర్పంచ్ ప్రయత్నిస్తున్నాడని వివరించారు. రైతులు, చేపల చెరువులు తయారు చేసే యజమానులను పిలిపించినప్పటికీ రైతులు మాత్రమే సచివాలయం కొచ్చి స్టేట్మెంట్ ఇచ్చారని మత్స్యశాఖ అధికారి తెలిపారు. చేపల చెరువుల తవ్వకాలకు గ్రామపంచాయతీ తీర్మానం అవసరమని చెప్పారు. అనుమతులు లేకుండా చేపల చెరువులకు తవ్వకాలు చేపడితే తక్షణమే చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.



రైతులతో మాట్లాడుతున్న ప్రసాద్‌రావు

# పోరాడి హక్కులు సాధించడమే నిజమైన నివాళి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మనువాద కార్పొరేట్ పాసిజానికి వ్యతిరేకంగా పోరాడి కార్మికుల హక్కులు సాధించడమే అమరవీరులకు నిజమైన నివాళి అని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యాక్షుడు కాళ్ల అప్పలసూరి అన్నారు. స్థానిక అమరవీరుల స్మారక భవనంలో నెల్లిమర్ల జ్యూట్ మిల్లు అమరవీరుల 31వ వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. సభకు ముందు అమరవీరులకు నివాళిగా యూనియన్ కార్యాలయ ఆవరణలో జెండా ఎగురవేశారు. అమరులైన కాళ్ళ అప్పల సత్యనారాయణ, నల్లి ముత్యాలనాయుడు, దువ్వారపు చిన్న, కోళ్ల అచ్చెప్పడు, కల్లూరి రాంబాబు ఫోటోల ముందు అమర వీరుల కుటుంబీకులు కొవ్వొత్తులు వెలిగించి, పూల దండాలు వేసి నివాళులు అర్పించారు. అరుణోదయ కళాకారులు అమరవీరుల పైన రాసిన ఉత్తేజకరమైన పాటలు పాడి అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు అనుబంద నెల్లిమర్ల జ్యూట్ మిల్లు కార్మిక సంఘం సీనియర్ ఆఫీస్ బేరర్ నామాల తిరుపతిరావు, భారత నాస్తిక సమాజం జాతీయ నాయకులు జీడి సారయ్య, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు రొంగలి అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గీత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు డి.ఏడుకొండలు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

# రూ.95 కోట్లతో తాగునీటికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి- మెంటాడ

ఆంధ్ర ప్రాజెక్టు ద్వారా తాగునీటిని 77 గ్రామాలకు అందించేందుకు రూ.95కోట్లతో ప్రతిపాదనలు పంపనున్నట్లు రక్షిత మంచినీటి పథకం డిఇ తిరుపతినాయుడు తెలిపారు. బుధవారం ఆంధ్ర, లోతుగెడ్డ, కూనేరు నీటిఎద్దడి వున్న గిరిజన గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆంధ్ర పంచాయతీలో కొండజీరికివలస, కుంబివలస, వేపగుడ్డి గ్రామాలను పరిశీలించి రూ.80లక్షలతో వాటర్ ట్యాంక్‌లు నిర్మించి కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేస్తామన్నారు. కూనేరు పంచాయతీలో ఎగువ మిర్తివలస, దిగువ మిర్తివలస గిరిజన గ్రామాల్లో వాటర్ ట్యాంక్ నిర్మించి కొళాయిల ద్వారా తాగు నీరు అందేవిధంగా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కొండ లింగాలవలస పంచా యతీ మధుర గిరిజన గ్రామాలు శీలవలస, సవరవిల్లిలో బోరుబావి తీసి ట్యాంక్ నిర్మించి తాగునీరు అందిస్తామన్నారు. ఈ పనులు వారం రోజుల్లో చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, రక్షిత మంచినీటి పథక ఏఇలు నవీన్, శ్రీనువాసురావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి టి సోములు, స్థానిక నేత పడాల గంగునాయుడు, ఉపసర్పంచ్ దాసరి శ్రీనివాసరావు, కృష్ణవేణి, బంగారి సింహాచలం, రెడ్డిగౌరీస్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిఇ తిరుపతినాయుడు

# పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని పంచాయతీ కార్యదర్శిల కార్యవర్గ ఎన్నిక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహిఒచారు. ఇఒపిఆర్‌డి ఏ.భాస్కరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా పక్కి కార్యదర్శి పి.మధుసు ధనరావు, అధ్యక్షులుగా పారాది కార్యదర్శి టి.రాఘవేంద్ర రావు, ఉపాధ్యక్షులుగా బి.ఎస్ కృష్ణమ్మ, పి.సింహచలం, ప్రధాన కార్యదర్శిగా అలజంగి కార్యదర్శి జి.నారాయణరావు, కోశాధికారిగా ఎన్.వి.రవివేద్రకుమార్ తదితరులు ఎన్నిక య్యారు. ఎంపిడిఒ రవికుమార్ ఎన్నికయిన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

**మెంటాడ:** మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇఒపిఆర్‌డి పి.విమల కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో సంఘ అధ్యక్షుడుగా ఎల్.ముత్యాలు, ఉపాధ్యక్షులుగా కె. గౌరి, ప్రధాన కార్యదర్శిగా జి.కృష్ణ, కోశాధికారిగా ఏ.రవి, సంయుక్త కార్యదర్శిగా కె.గణేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ఆదర్శ రైల్వేస్టేషన్ పనులు వేగవంతం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి ఆదర్శ రైల్వేస్టేషన్ పనులు వేగవంతం చేయాలని రైల్వే డిఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు కోరారు. స్థానిక రైల్వే స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. నూతన భవనం, ఆదర్శ రైల్వేస్టేషన్ పనులు, ప్లాట్ ఫామ్‌పై తాగునీటి సౌకర్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడో లైన్ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈనెల 15న రైల్వే జిఎం రైల్వే స్టేషన్‌కు వస్తారని చెప్పారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయనతో రైల్వే అధికారులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్‌ఎం

# ఉల్లాసంగా గుర్రపు పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరులో చిన్నమ్మలు, పెద్దమ్మలు, వీరాంజనేయ తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఉల్లాసంగా సాగింది. 18 గుర్రాలు పాల్గొని తలబడ్డాయి. మొదట విజేతగా నిలిచిన గుర్రానికి రూ.12వేలు, రెండవ గుర్రానికి రూ. 10వేలు, మూడవ గుర్రానికి రూ.8వేలు, నాలుగో గుర్రానికి రూ.6 వేలు నగదు బహుమతిని అందించారు. సంగిడీరాళ్ల పోటీల్లో విజేతలకు స్లోబైక్ విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్దలు బుద్ధ అప్పలనాయుడు, ఎంపిటిసి టివి రమణ, టిడిపి నాయకులు సలాది వెంకటరమణ, రాధి అప్పలనాయుడు, వి.రాంబాబు, కె.సూరిబాబు, ఎస్ జగ్గారావు, ఎస్ నరేంద్ర, శంకర్రావు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.



# చురుగ్గా సిసి రోడ్డు నిర్మాణ పనులు

**వేపాడ:** మండ లంలోని కృష్ణరాయుడుపేటలో ఉపాధి హామీ నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా తమ గ్రామానికి 10 లక్షల రూపాయలు నిధులతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడం ఆనందంగా ఉందని టిడిపి కమిటీ అధ్యక్షుడు హేమంతు, గొంప సూర్యనారాయణ, చెలిపోని రామకృష్ణ, గొంప సంతోష్, వంటాకు సముద్రమనాయుడు, ఆబోతు అప్పారావు తెలిపారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో ఇసిసిఇ దినోత్సవం

**బొబ్బిలి:** మున్సిపాలిటీలోని 3,14,16,18 వార్డులలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం ఇసిసిఇ దినోత్సవం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలు బరువును చూసి బరువు తక్కువ ఉన్న పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని తల్లిదండ్రులకు అంగన్వాడీలు సూచించారు. క్రమం తప్పకుండా పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, హెల్పర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వక్ఫ్ స్థలాల పరిరక్షణకు చర్యలు: కలెక్టర్

**విజయనగరంటౌన్:** జిల్లాలోని వక్ఫ్ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లా స్థాయి వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం నిర్వహించారు. వక్ఫ్ స్థలాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. జిల్లాలో మొత్తం 99 వక్ఫ్ స్థలాలను గుర్తించామని, వీటిలో 32 స్థలాలను ఇప్పటికే నోటిఫై చేశామని చెప్పారు. అన్ని స్థలాల వివరాలను రెండు రోజుల్లో సంబంధిత ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేయాలని వక్ఫ్, మైనారిటీ శాఖాధికారులకు సూచించారు. వివరాలు ఇచ్చిన పది రోజుల్లోగా వక్ఫ్ స్థలాలన్నిటినీ సర్వే చేసి, సరిహద్దులు నిర్ణయించాలని ఆర్‌డిఒలను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.దీనిపై ఈ నెల 25న సమావేశం నిర్వహించి చర్చించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎఎస్‌పి సౌమ్యలత, డిపిఒ టి.వెంకటేశ్వ్రరావు, ఎస్‌డిసి జోసెఫ్, జిల్లా రిజిస్ట్రార్ కుమారి, సర్వే శాఖ ఎడి రమణమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, మున్సిపల్ కమిషనర్లు పి.నల్లనయ్య, జె.రామప్పలనాయుడు, రామలక్ష్మి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ప్లాస్టిక్ నిషేధం

**విజయనగరం టౌన్ :** నగరంలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించామని, దీనికి ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. బుధవారం 17వ డివిజన్ లో పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని సాధ్యమైన పనులను అక్కడికక్కడే పరిష్కరించారు. అక్కడక్కడ ఉన్న పోస్టర్లను, ఫ్లెక్సీలను తొలగించి వేయాలని సిబ్బందికి ఆదేశించారు. నీటిని వృథా చేయరాదని మహిళలకు సూచించారు. ప్రతి కొళాయికి ఆన్ ఆఫ్ స్విచ్ లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. టిఫిన్ దుకాణాలు, తోపుడు బళ్ళు రహదారులపై ఉండడాన్ని గమనించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, పారిశుధ్య పర్యవేక్షకులు అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## గంజాయి సేవిస్తున్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెద్ద తాడివాడ పంచాయతీ బేతనాపల్లి గ్రామ శివారులో గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ ఏ సన్యాసినాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. కొంతమంది వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లుగా సమాచారం రావడంతో మా సిబ్బందితో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి రైడ్ చేసి గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నాం. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశాం. వారి వద్ద నుండి 160 గ్రాములు గంజాయి, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశాం. పట్టుబడిన వారిలో విజయనగరం పట్టణానికి చెందిన క్షత్రియ జస్వంత్, యడ్ల గోపి మరో ముగ్గురు మైనర్లు ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

## యువకుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని బసవపాలెం గ్రామానికి చెందిన యువకుడుపై బుధవారం ఫోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బసవపాలెం గ్రామానికి చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికను వేధిస్తున్నాడని బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

## పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక బాలురు బిసి వసతి గృహంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎన్.రాకేష్ మంగళవారం పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడని వార్డెన్ తెలిపారు. బాలుడును స్థానికి పిహెచ్‌సికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. ఈ విద్యార్థి బ్యాగులో రెండు ట్యాబులు ఉన్నాయని ఇంకొకరి ట్యాబ్ దొంగిలించావని తోటి విద్యార్థులు అడుగగా భయపడి పురుగుల మందు తాగినట్లు తోటి విద్యార్థులు తెలిపారన్నారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు గత మూడు రోజుల నుండి ఈ విద్యార్థి స్కూల్‌కు రావడం లేదని వివరణ ఇచ్చారు.